# జీవనయానం

## – పద్మలతా జయరాం



జీవనయానం పద్మలతా జయరాం

ఎక్కడో తప్ప జన సంచారం కన్పించటం లేదు. పచ్చని పైర్లు, తలలూపుతూ వీడ్కోలు చెప్తున్నట్లున్న ప్రొద్దతిరుగుడు పూవులు, తెల్లవారుతూందనటానికి సూచికగా కొండల మాటు నుంచి దోబూచులాడుతున్న సూర్యుని కాంతి, నారింజరంగులో ఆకాశానికి క్రొత్త అందాన్ని సంతరిస్తూంది. రఁయ్యిన సాగిపోతోంది హుస్సేన్‌సాగర్ ఎక్స్‌ప్రెస్.

నలువు, తెలువుల మిశ్రమంలా వున్న జుట్టు ముఖాన్ని అలముకుంటూంటే, అలిసిపోయిన కళ్లతో కిటికీలోంచి తదేకంగా చూస్తోంది వర్ధని. చల్లనిగాలి చెవుల్లో హోరు పుట్టిస్తున్నా, ఆలోచనల ఝుంఝూ మారుతాల్లో కొట్టుకుపోతున్న ఆమెకు, గాజు కిటికీ మూయాలని కూడా తోచటం లేదు. పై బెర్తు మీద పడుకున్న ఆమె భర్త రంగస్వామి ఆదమరిచి నిద్రపోతున్నాడు. రాత్రి సగం వరకూ దగ్గుతూ, ఆయాసపడుతూ అవస్థపడుతూంటే మాత్రలు వేస్తూ, మందు త్రాగిస్తూ రాత్రి మొత్తం ఆమె మెలకువగానే వుంది. ఇపుడు ఆమెకు రమ్మన్నా నిద్ర రావడం లేదు. గతం తాలూకు జ్ఞాపకాలు, భవిష్యత్తును గురించి భయాలు ఆమెకు కునుకు రానీయటం లేదు.

0000

పాతికేళ్లయినా నిండకుండానే అయుదుగురు బిడ్డల తల్లి అయింది వర్ధని. ఎందుకు అంతమందిని కనాలి అని కానీ, ఎలా పెంచాలి అని కానీ ఆలోచనలు రాకుండానే ఏడేళ్ల వైవాహిక జీవితం అయిపోయింది. పట్టుమని పావలా పూలు కూడా కొనుక్కోలేని స్వేచ్ఛ అస్తమానం పని, పని అంటూ వేధించుకు తినే అత్తగారూ ఆడబిడ్డలూ. "అన్నం తిన్నావా" అనికూడా అడగని కనికరం లేని కరకు మొగుడు ఎప్పుడూ, ఏదో ఓ జబ్బుతో ఎవరో ఒకరు పడకేసే పిల్లలూ,

సంక్షిప్తంగా చెప్పాలంటే వర్ధని వైవాహిక జీవితం అదే, పుట్టింటి అండ లేని ఆమె, అనుభూతుల్ని మరిచిపోయి నెట్టుకొస్తున్న ఓ జీవం వున్న ప్రతిమ అంతే, వున్న కొద్దిపాటి ఆస్థిని కరిగించి రాజకీయాల్లో తలమార్చి ఘోరంగా విఫలమయిన మామగారి తాలూకు పోలికల్ని పుణికిపుచ్చుకున్న రంగస్వామి చేసేది చిన్న వుద్యోగమయినా, డాబులకు దర్పాలకు లోటులేదు. భార్య ఒంటి మీద బంగారమంతా తాకట్టుపెట్టి గొప్పకోసం పేకాటలాడటం, ఇంటి నిండా జనాన్ని చేర్చి త్రాగి తందనాలాడటం, ఇంట్లో వాళ్లు తినడానికి లేకపోయినా, బయటివాళ్లకి విందుభోజనాలు ఏర్పాటుచేయడం లాంటి విశిష్ట కార్యక్రమాలతో వర్ధనికి వున్న ఆ కాస్త బంగారం కూడా పోయి, పూర్తిగా దరిద్ర దేవత, మారురూపంలా తయారయింది. ఎక్కువ కాలం మన్ను తిన్న పాములా పడి వున్న ఆమెకు, కాస్త నోరు వచ్చి ఎదురుతిరిగితే కాలుతున్న సిగరెట్ పేకలూ, తోలు బెల్టు దెబ్బలు భర్త ఇచ్చిన అపూర్వ కానుకలుగా ఒంటిమీద మిగిలాయి. అప్పడాలు వత్తీ, జాకెట్లు కుట్టీ అంతో, ఇంతో సంపాదించి గవర్నమెంటు స్కూళ్లలో పిల్లల్ని చదివిస్తూ పెంచి పెద్ద చేసిన తర్వాత, పిల్లలు, ఏదో ఒక వుపాధి అంటూ కల్పించుకుని స్థిరపడ్డారు ఇన్నాళ్లికి. ఉన్న ఇద్దరు ఆడపిల్లల్లో ఒకళ్లని తమ్ముడికే ఇచ్చింది. రెండోదాన్ని గంతకు తగ్గ బొంతను చూసి పెళ్లి చేయగల్గింది. ఇప్పుడు, ఇన్నాళ్ల తర్వాత కూతురు, తమ్ముడూ పట్టుపట్టడంతో భర్తని ఒప్పించి మొట్టమొదటి సారిగా రైలు ప్రయాణం కట్టింది బొంబాయికి, ఉడుకుతున్న వయసు, తగ్గుతున్న ఓపిక భార్య యొక్క విలువను ఇప్పుడిప్పుడే తెలియజేస్తున్నాయి రంగస్వామికి. కానీ, ఏం లాభం? పైలా పచ్చీసుగా తిరిగిన తిరుగుళ్ల తాలూకు జబ్బులు ఇప్పుడు తమ ప్రభావం చూపిస్తున్నాయి. విపరీతమైన దగ్గు, ఆయాసం, నీరసంలాంటి రుగ్మతలతో మంచి వైద్యం చేయించగల ఆర్థిక స్తోమత లేకపోవడంతో, రంగస్వామి ఆరోగ్యం, అతనికంటే ఎక్కువగా వర్ధనినే కలవరపరుస్తోంది.

000

తెల్లగా తెల్లవారడంతో, నిద్రలో మునిగిపోయిన ప్రయాణికులందరిలోను కదలిక వచ్చింది. దంతధావనాలకోసం తిరిగే వాళ్లతోటి, కాఫీ, టీలు అమ్మేవాళ్లతోటి రైలు బోగీ అంతా రణగొణధ్వనిగా వుంది. కాఫీ వాణ్ణి కేకేసి ఓ కప్పు కాఫీ త్రాగింది వర్ధని. ఆదమరిచి నిద్రపోతున్న భర్తను లేపాలా, వద్దా అన్న సందిగ్ధంలో పడి నెమ్మదిగా ఆయనచేతి మీద తట్టింది."

"ఏమండీ, ఏమండీ" అంటూ.

గాఢ నిద్రలో వున్నాడేమో కొంచెం కూడా కదలలేదు రంగస్వామి. "రాత్రంతా మేలుకునే వున్నారు దగ్గుతో, కానీయ్ పడుకోనీ మరి కాసేపు" అనుకుంటూ మళ్లీ కిటికీ దగ్గర కూర్చుండిపోయింది వర్ధని.

ఎదురుగా వున్న మార్వాడీ దంపతులు క్యారేజీలు తెరిచి, తినడానికి ఉద్యుక్తులవుతున్నారు అప్పుడే. పెద్దవైరు బుట్టనిండా నాలుగైదు రకాల ఆధరువులు, పూరీలు, స్వీట్లు, పళ్లు, ఇవన్నీ కాక చుడువా, బూందీలాంటి చిరుతిళ్లు వున్నాయి అందులో. ముందురోజు మధ్యాహ్నం నుండి ఏదో ఒకటి తింటూనే వున్నారు భార్యా భర్తలిద్దరూ. తెలుగు తప్ప మరో భాష తెలియని వర్ధనిని, తెలుగు తెలియని ఆ దంపతులిద్దరూ ఆమెకు కూడా ఏదో ఒకటి ఇవ్వడానికి ప్రయత్నించారు కానీ ఆమె సైగలతోనే వద్దు అని చెప్పింది. మిగతా రెండు సీట్లు ఖాళీగా వుండటంతో వారి మధ్య సంభాషణ సాగలేదు. బ్రేక్‌ఫాస్ట్ చేసిన తర్వాత చెయ్యి కడుక్కోవడానికి వెళ్తూ అడిగాడు ఎదురు సీట్ లోని మార్వాడీ ఆయన.

"సార్‌ని లేపకపోయారా! కాఫీ కూడా త్రాగినట్లు లేదు" ఆయన మాట అర్థంకాక పోయినా, చేయి చూపిస్తూ అడగడం వలన అర్థం చేసుకోగల్గింది వర్ధని.

'సరే' అన్నట్లు తల ఊపింది.

దంపతులు టాయ్‌లెట్ వైపు వెళ్లగానే, తిరిగి రంగస్వామిని తట్టి లేపుదామని, కొద్దిగా పాదాలు ఎత్తి మిడిల్ బెర్తులోని భర్త భుజం పైన చేయివేసింది. ఒక్కసారిగా షాక్ కొట్టినట్లయింది ఆమెకు. అనుమానంగా చూస్తూ, ఆయన నుదురుపైన చెయ్యి వేసి చూద్దామని అటు తిరిగి పడుకున్న ఆయన్ని తనవైపు త్రిప్పింది అతి కష్టంగా.

కొద్దిగా తెరుచుకున్న నోరు, ఎటో చూస్తున్నట్లుగా నిర్జీవమైన కళ్లు, ఆమెలోని అనుమానాన్ని, నిజం అంటూ ధృవీకరిస్తున్నాయి. ఆమె గుండె చప్పుడు, ఆమెకే వినిపిస్తోంది అతి వేగంగా. చచ్చుపడ్డట్లయిన ఆమె కాళ్లూ, చేతులూ కూడదీసుకుంటూ చెవిని అతని గుండెలమీద ఆన్చింది. ఏ సడీలేని ఆగిపోయిన అతని హృదయం చల్లగా తగిలింది ఆమెకు. ఎప్పుడు

## ఎటూకాని రమ్య!

మునుపు తన గ్లామర్‌తో తెలుగురంగాన్ని ఒక ఊపు ఊపిన తళుకుతార రమ్యకృష్ణ, పాపం ఇప్పుడు బాలీవుడ్ దిగుమతులతో ఆందోళన చెందుతూందట. ప్రస్తుతం రమ్య చేస్తున్న చిత్రం 'బడ్జెట్ పద్మనాభం' ఒక్కటే. ఇప్పుడొస్తున్న కుర్రతారామణుల గ్లామర్ ముందు రమ్య గ్లామర్ వెలవెలబోతూందని ఓ నిర్మాత అన్నాట్ట. పోనీ, గ్లామర్ పాత్రలు కాక దేవతల పాత్రలు చేద్దామా అంటే, అక్కడ మీనా గట్టిపోటీనిస్తూందట. పెద్దహీరోలంతా సౌందర్య, సిమ్రాన్‌లతో చేస్తామంటుంటే, కుర్రహీరోలు కొత్త హీరోయిన్ల వైపు మొగ్గుచూపుతున్నారట. ఇక తమిళచిత్రరంగం నుంచి కూడా ఆఫర్లు లేకపోవటంతో రమ్య పరిస్థితి ఇబ్బందిగానే వుందట.

ఎన్.



పోయిందో ప్రాణం, కడదాకా తనతో నడిచిన తోటి మనిషికి చెపకుండానే పోయింది. కష్టాలతోను కడగండ్లతోను గడిచిపోయిన ఆమె బ్రతుకు ప్రయాణం కాస్తంత ఆప్యాయతకు, అనురాగానికి నోచుకుంటున్న ఈ సమయంలో, మృత్యువు గమ్యం చేరకుండానే ఆయనను కబళించివేసింది.

"ఇప్పుడు ఏం చేయాలి?"

"ఎలా?"

ఎవ్వరూ తెలీదే తనకు. అసలు ప్రయాణం అనేదే మొట్టమొదటిసారి. భాషరాదు, డబ్బు లేదు జాకెట్లో దోపుకున్న పర్సులో టిక్కెట్లతో పాటుగా వున్న వందరూపాయల చిల్లర తప్ప, అక్షరం ముక్క వ్రాయటం కానీ, చదవటం కానీ రాదు.

"ఎవరైనా తెలుగు వాళ్లని కలిసి విషయం చెప్తే!" గుండె దిటవు చేసుకుని అనుకుంది. తిరిగి మళ్లీ అనుమానం "ఏమో! వాళ్లు సహాయం చెయ్యొచ్చు. చెయ్యకపోవచ్చు. తనను, ఈ శవాన్ని సామానుతో సహా ఏదో ఒక స్టేషన్లో దించేస్తే ఎలా! కూతురు, తమ్ముడు వుండే అడ్రస్ తనకు తెలియదు. అడ్రస్ ఎక్కడా వ్రాసి కూడా పెట్టుకోలేదు. చేతిలో డబ్బు లేకుండా ఆ శరీరాన్ని సొంత ఊరికి, వెనక్కి తీసుకెళ్లడం మాత్రం ఎలా!"

ఊరుతున్న కన్నీళ్లను బలవంతాన ఆపుకుంటూనే పరి పరివిధాలా ఆలోచిస్తోంది వర్ధని. సజీవంగా వున్నన్నాళ్లూ ఆయన సహచర్యం చేసిందీ భయంతోనే. ఈ రోజు ఆయన పోయాక, ఆ మృతశరీరంతోనూ అదే భయంతో సహవాసం చేస్తోంది. ఏదైతే అదే అయింది, ఈ విషయం బొంబాయిలో దిగేవరకూ ఎవరికీ చెప్పకూడదని గట్టిగా నిర్ణయించుకుంది.

ఎదురుగా వచ్చి కూర్చున ఆ మార్వాడీ ఆయన మళ్లీ అడగకముందే, తనే చెప్పింది. వర్ధని "ఇప్పుడే లేచి కొద్దిగా కాఫీ త్రాగారు. బాగా అలిసిపోయారు. అందుకే తనను భోజనానికి కూడా లేపవద్దన్నారు."

ఆయనకి ఏం అర్థమయిందో తెలియదు కానీ, బుర్ర ఆడించి, ఇందాక కొన్న మరాఠీ పత్రిక చదవడంలో మునిగిపోయాడు. ఆయన భార్య మాత్రం అనుమానంగా చూస్తోంది వర్ధని వైపు.

నిమిషాలు గంటల్లా గడుస్తున్నాయి. భారంగా వుంది వర్ధనికి. నలభై సంవత్సరాల వైవాహిక జీవితం సినిమా రీలులాగా తిరుగుతోంది ఆమె కళ్లముందు, మంచివాడో, కాదో ఇన్నేళ్ల సుదీర్ఘ దాంపత్యం సాగిపోయింది. "దెబ్బలు తినీ తినీ తన శరీరం బండబారి పోయిందనుకుంది. నీరు ఇంకిపోయి, కళ్లు ఇక కన్నీరు కురిపించలేవు అనుకుంది ఇన్నాళ్లూ. కష్టాలు కొలిమిలో కొట్టుకుంటూ, ఈ మనిషి పోతే బాగుండు అని కూడా అనుకుంది చాలాసార్లు. కానీ, కానీ! మగదిక్కు అంటూ ఒకటి వుంది ఈ రోజు వరకూ. కొద్దో గొప్పో ఆయనలో మార్పు కూడా వచ్చింది ఇప్పుడిప్పుడే. భగవంతుడెంత నిర్దయుడు? రేపటి నుంచీ ఏమిటి తన గతి? ఎవరి పంచన బ్రతకాలి? రేపటి నుంచీ ఏమిటి తన గతి? ఎవరి పంచన బ్రతకాలి? తిన్నా, తినకపోయినా తనది అంటూ ఓ గూడు వుంది. అంతో, ఇంతో ఆయన తెచ్చివ్వడం జరుగుతోంది. తనకా ఓపిక అయిపోయింది. ఇదివరకులాగా అప్పడాలూ, వడియాలూ ఒత్తలేడు. బట్టలూ కుట్టలేడు. కుట్టినా ఫ్యాషన్‌గా కుట్టడం రాదు కాబట్టి తన వద్ద కెవరూ రాకపోవచ్చు. అసలు ఇది ఎలా జరిగింది?" మనసులోనే కుళ్లి కుళ్లి ఏడుస్తోంది వర్ధని. ఏ క్షణాన అయినా బయటకు భోరున ఏడ్చే ప్రమాదం వుందని బలవంతాన తనను తాను కంట్రోల్ చేసుకుంటోంది.

"టికెట్ ప్లీజ్" కొద్దిగా గట్టిగా పిలిచినట్లు అనిపించేసరికి ఉలిక్కిపడింది.

ఎదురుగా నల్లకోటులో టి.సి. అదురుపాటును ఆపుకుంటూ పర్సులోంచి టికెట్లు తీసి చూపించింది. తృప్తిగా తలాడించి, తెలుగులో అడిగాడు టి.సి.

"ఏమ్మా! సార్‌ని లేపకపోయారా! ఇప్పుడు ఎక్కేవాళ్లు చాలామంది వుంటారు. బెర్త్ వేసి వుంటే ఇన్‌కన్వీనియంట్‌గా వుంటుంది".

"సరే! అన్నట్లు తల ఊపింది వర్ధని.

"ఆయనకు ఒంట్లో బాలేదు. ఎక్కిన వాళ్లని ఇక్కడ సర్దుకోమని చెప్తాం లేండి". ఎదురు సీటు మార్వాడీ ఆయన ఆదుకున్నారు ఆమెని.

"ఓ.కె. మీ ఇష్టం". వెళ్లిపోయాడు టి.సి.

కాలం అతి నెమ్మదిగా గడుస్తున్నట్లుంది వర్ధనికి. ఆగుతూ, ఆగుతూ, ఇంక తప్పదన్నట్లు గమ్యస్థానానికి చేరింది రైలు. ప్రయాణం సాగినంత సేపూ, ఇతరులను మభ్య పెట్టడం కోసం భర్తతో మాట్లాడుతున్నట్లూ, మంచి నీళ్లు ఇస్తున్నట్లూ నటిస్తూ, ఆయన్ని అటునుండి ఇటూ, ఇటునుండి అటూ పడుకోబెడుతూ గడిపిన వర్ధనికి, స్టేషన్లో కూతురు కన్పించేసరికి అంతవరకూ వున్న టెన్షన్ శాతం తగ్గడంతో ఆనందంప దుఃఖం కలగలిసిపోయింది. రైలు బోగీలోనే కూలబడి భోరుమని పెద్దగా ఏడవడం మొదలెట్టింది.

"అక్కయ్యా! ఏమిటిది? ఏమైంది? అందరూ మననే చూస్తున్నారు. ఇదిగో విమల కూడా వచ్చింది చూడు" వీపు మీద రాస్తూ అనునయిస్తున్న తమ్ముడిని గట్టిగా పట్టుకుని, ఇంకా అలాగే ఏడుస్తోంది వర్ధని.

"అమ్మా! ఇదేవిటే! ఇట్లా ఏడుస్తున్నావేమిటి? నాన్న పడుకునే వున్నాడేమిటి?" అర్థం కావడం లేదు. కూతురు విమలకి తల్లి పరిస్థితి.

ఇంతలో బావగారిని లేపడానికి ప్రయత్నిస్తున్న విమల భర్త నారాయణ, మంచులా తగిలిన ఆయన శరీరం, బిర్ర బిగుసుకు పోయిన కాళ్లూ చేతులూ చూసే సరికి కెవ్వున కేక వేశాడు భయంతో.

క్షణాల్లో జనం పోగయ్యారు బోగీ నిండా. బలవంతంగా బయటకు తీసుకువచ్చారు శవాన్ని. విషయం తెలిసిన తోటి ప్రయాణీకులు నిరుత్తరులయ్యారు. తాము ఇంతసేపూ శవంతో సహప్రయాణం చేశామని తెలిసే సరికి.

ఇవ్వేమీ పట్టని వర్ధని, ఆపుకున్న దుఃఖం కట్టలు తెగుతుండగా గోడుగోడున విలపిస్తోంది నిర్విరామంగా. ●

